కథానిక:

# ఆకు తొడిగిన చెట్టు

రచన: శ్రీ 'రాఘవ'

అప్పటికి ఇంకా నాకు చిన్నతనం కావటంవల్ల, కనిపించే ప్రతి దృశ్యమూ ఎన్నో అమాయకపు ఆలోచనలు కల్పిస్తూండేది. నా కళ్లముందే నిత్యమూ మారే ప్రకృతికూడా యెంతో రమణీయాకృతి దాల్చి, పరవశింప చేస్తూండేది.

ముఖ్యంగా, నా చిన్నతనపు ఆలోచనలకూ, అభిరుచులకూ - మా వూళ్ళో పిచ్చెక్కి తిరిగే సీతమ్మ - ఓ పెద్ద కారణభూతురాలైంది.

సీతమ్మ యెవరో మొదట్లో నాకు తెలియదు. ఉదయించే సూర్యునితో బాటు నిద్రలేచి కనిపించేది.... అస్తమించే చంద్రుడి వరకూ యేంచేస్తూ వుండేదో తెలియదు. నేను మాత్రం - "తిరుగుతూ వుంటుంది" - అని అనుకొంటూండేవాడిని. కొన్నాళ్లకి నేనిలా అనుకున్నది. యధార్థమని తేలింది-సీతమ్మ అలా తిరుగుతూనే. ఆ యింటికీ - యీ యింటికీ వెళుతూ-దొరికిన తిండేదో తింటూ - జీవితాన్ని గడుపుకొంటూ వుంటోందని. చూడటానికి సీతమ్మ చక్కగానే వుండేది. మరి పిచ్చి మనిషని మా వూరు - వాడా, మా యింట్లో వాళ్లు ఎందుకంటున్నారో నాకు తెలిసేది కాదు. మా పెద్దక్కయ్యలా గుండ్రంగా ఎర్రటి కుంకుమబొట్టు నుదుటన పెట్టేది. చిర్రిజుట్టయినా అణిగే వుండేది. వాలుజడ సగంవరకూ వూడివుండేది వీపుదిగి. మహా వుంటే మా పెద్దక్కయ్యకంటే ఒకయేడో-అరయేడో పెద్దగానే కనిపించేది. తేడా మాత్రం ఒక్కటే - మా పెద్దక్కయ్య పెళ్లయి చీరెలు కడుతూంటే, సీతమ్మ ఇంకా పరికిణీ - జాకెట్టూ - ఓణీ వేసుకుని; పదహారేళ్ల బాలా కుమారిలా - బంతి పూవులా - తిరుగుతూ వుండేది. మా పెద్దక్కయ్యకు ఒక మొగపిల్లాడు కలిగినా; సీతమ్మకు ఎందుకు పెళ్ళికాలేదో తెలిసేది కాదు నాకు.

సీతమ్మ నాకెప్పుడు కనిపించినా ఎంతో గంభీరంగా - యీప్రపంచంతో సంబంధం లేని మనిషిలాగా - యేదో ఆలోచనా ముద్రతో నిండి యుండేది. బహుశా ! ఇలా ఉండటంచేతనే కాబోలు సీతమ్మని మా వూరు కుర్రకారు వారంతా "పిచ్చి మనిషిగా జమ కట్టిందని అనిపించేది.

సీతమ్మని గురించి సాకల్యంగా తెలిసిన పెద్దలందరికీ - ఆమె అంటే అదో రకమైన సానుభూతీ - అనుకంప వుండేది. కుర్రకుంకలు ఎప్పుడైనా, సీతమ్మని నడిబజార్లో ఏడ్పిస్తూ; పరాచికాలాడుతూంటే, - రచ్చబండమీద కూర్చొన్న రాజాగార్లంతా, తలో రకంగా మందలిస్తూ -

"దాన్నలా అనకండిరా ! దిక్కులేంది.... ఏడుస్తుంది.... దాని ఉసురు తగిలిందో వూరూ - వాడా సర్వనాశనమవుతుంది" - అనేవారు.

సీతమ్మను సగంవూరు పిచ్చిదంటూనే ఎందుకింత ఆధిక్యతతో చూస్తూండేదో నాకు తెలిసేది కాదు 'నిజంగా పిచ్చిదేనా ? - ' అని నాకు మాత్రం సందేహం కలిగేది. ఆమెలో యేగొప్పతనం వుందో మరి: ఎన్నిసార్లు కంటబడినా అర్థమయ్యేది కాదు. బహుశా ! నేను చిన్నవాణ్ణి కావటం వల్లనేమో ! మరి....

సీతమ్మ యెవ్వరినీ యేమీ అనేదికాదు. ఎంతమంది యెన్నిరకాలుగా తనను యేడ్పిస్తున్నా; హేళన చేస్తున్నా; సరసాలాడి మాటలన్నా—నవ్వుతూ; ఒక్కసారి అందరివంకా చూసి- "వెర్రిమాలోకం" - అన్నట్లు పెదవి విరిచి; తలవంచుకొని తన దారిన తనెటో చక్కా పోయేది.

తలనెరిసిన పెద్దలు మాత్రం—

"నువ్వేమీ కోపగించుకోకు సీతాలూ ! తెలిసీ - తెలీని కుర్రసన్నాసులు ! దయతో విడిచిపెట్టు !" - అనేవారు.... ఎందుకో అప్పుడు వాళ్ల గొంతుకలలో కరుణ తొణికిసలాడేది.

"సీతమ్మ చాలా మహిమ కలది." - అన్న కొత్త విషయం: కొన్ని రోజులు పోయాక: మా బామ్మ అనగా విన్నాను. అప్పుడు సీతమ్మ, మా వాకిటరుగుమీద జామికాయ తింటూ కూర్చొని వుంది.... కిటికీలోంచి నేను చూస్తూనే వున్నాను— ఆమె తినే జామికాయకూడా మాదొడ్డిలోదే! సరాసరి తనేవెళ్ళి కోసితెచ్చుకుని తింటోంది—

సీతమ్మలో వున్న ఆ మహిమ ఏమిటో నాకు తెలుసుకోవాలనిపించింది. అడుగుదామనుకున్నాను మా బామ్మని. తీరా అడిగాక, -

"నీకేం అర్థం అవుతుందిరా చెప్పినానూ ! చంటివెధవ్వి !" — అని ఆవిడ ప్రక్కకి త్రోసివేస్తుందేమోనని సందేహం కూడా కలిగింది అయినా, బామ్మని మంచి చేసుకోవటం, ఎందుకయినా మంచిదనిపించింది. ఆనాటి నుంచీ ఆవిడ అడక్కుండానే దేవుడి పూజకు పూలూ; ఒత్తులు చేసుకోడానికి ప్రత్తీ, అవీ - అందిస్తూ వచ్చాను. ఆవిడ ఆశ్చర్యపడింది. ఒకనాడు అనేసింది—

"ఇదివరకు చెప్పినా చేసేవాడివి కాదు. యిలాంటి పనులు.... ఈ మధ్య చెప్పకుండానే చేస్తున్నావేం రా నాయనా." అని.

"నువ్వు చాలా మంచిదానివి గదూ బామ్మా !"- అన్నాను.

ఆవిడ నా మాటకు ఉబ్బి తబ్బిబ్బై, బోసి నవ్వుల్ని ఒలకబోసింది- "మా నాయనే ! మా నాయనే ! ఎవ్వరు చెప్పార్రా ఇలా అనమనీ !"- అంటూ నా తల నిమురుతూ; నా బుగ్గలు పుణుకుతూ; తన సంతోషాన్ని వెళ్లబుచ్చింది.

ఇదే మంచి సమయమనుకుని- వెంటనే "నేనొకటి అడుగుతానుగానీ, చెబుతావా బామ్మా !"- అన్నాను.

"ఏమిట్రా వెర్రి వెధవా!"- అంది.

అడిగాను సీతమ్మ మహిమ ఏమిటో చెప్పమని.

"సరే! ఇదా నీ ముద్దూ - ముచ్చటాను అంటూ ఆమె, ఒత్తులు చేస్తూనే చెప్పనారంభించింది-

"సీతమ్మ యెవరంటే మన వూరికి గణాచారి. అసలు వాళ్ల వంశమే గణాచార్ల వంశం.... మన వూరు క్షేమంగా-బాగా వుండాలన్నా; నాశనం కావాలన్నా వాళ్ల చేతుల్లో పని. మన వూళ్లో అప్పుడప్పుడూ వర్షాలు కురవకపోయినా; పంటలు దిట్టంగా పండకపోయినా; మాయదారి రోగాలతో వూరు వూడ్చి పెట్టుకుపోతున్నా-, కొలుపులు, జాతర్లు, తిరునాళ్ళు చేస్తూంటారు. జ్ఞాపకముందా నీకు! చూడటం లేదూ! నిరుడుకూడా చూశావుగా నా చంకనెక్కి. అప్పుడు సీతమ్మా, వాళ్ల ఇంట్లో వాళ్ళూ, చాలా భయంకరంగా వుంటారు. ఒంటి నిండా పసుపూ - కుంకాలు పులుముకొని; సాంబ్రాణిపొగల్లో వేప మండలు పుచ్చుకుని గంతులు వేస్తూంటారు పూనకం పూని. అప్పుడు వాళ్లకు దేవత పూనిందని జనమంతా అనుకుంటారు. ఏం మాట్లాడినా, ఏ కోరిక కోరినా, జనమంతా అక్షరాల ఆ మాటల్ని శిరసావహించి; తీరుస్తారు. చేయవలసిన పనులన్నీ చేస్తారు. మనం, ఆ గణాచార్లు చెప్పినట్లు అన్నీ చేసినట్లయితే అందరూ హాయిగా; బాగా వుండేలాగూ- వర్షాలు కురిసేలాగూ; పంటలు పండేలాగూ; వూరు ఆరోగ్యంగా వుండేలాగూ చేస్తారు. ఇలాంటి మహిమ సీతమ్మ దగ్గర కూడా వుంది. ఇప్పుడు సీతమ్మ ఆ వంశంలో ఒక్కతే అయింది. మిగతా వాళ్లంతా నిరుడే పోయారు. అందువల్ల సీతమ్మని గణాచారిగా అందరూ గౌరవిస్తారు.... ఎవ్వరూ పల్లెత్తుమాట అనరు."

—ఇలా, మా బామ్మ చెప్పేసరికి నాకు ఆశ్చర్యం వేసింది. అప్పుడు సీతమ్మ నా కళ్లకి ఓ దేవతలాగే కనిపించింది. నాకూ ఆమెని పూజించాలనిపించింది. మా వూరినీ, మా ప్రాణాల్నీ కాపాడుతున్న గొప్ప మనిషని అర్థం చేసుకున్నాను.

ఆనాటి నుంచీ, సీతమ్మ ఎక్కడ కనిపించినా పూజ్యభావంతో చూసేవాణ్ణి! మనస్సులో నమస్కరించుకునేవాణ్ణి!

సీతమ్మంటే పెద్దపెద్ద వాళ్లకి యెందుకు గౌరవముందో క్రమంగా అర్థమవుతూ వచ్చింది నాకు.

ఇలావున్న పరిస్థితిలో వర్షాకాలం వచ్చింది. చూస్తూండగానే ఆకాశమంతా నల్లని మేఘాల్తో కప్పుకుని పోయింది ఒకనాడు. "ఇవ్వాళ వర్షం దంచి కొడుతుందని, మా నాన్నగారు, ఆకాశం వంక చూస్తూ, మా యింట్లో అందరికీ వినబడేటట్లు అన్నారు. అప్పటి కప్పుడే, బైటినుంచి తడవకుండా వుండే సామానంతట్నీ ఇంట్లోకి సర్దివేశారు....

నాకు, వర్షం జోరుగా - ఎడతెరిపి లేకుండా జడిగా కురవడమంటే భలే సరదా! ఎందుకనంటే, వర్షపునీరు కాలవలుగట్టి వంపులు వంపులుగా - మెలికలు మెలికలుగా బుడగలు వేసుకుంటూ పారుతూంటే, కాగితప్పడవలుచేసి, వేసుకొని ఆడుకోవచ్చునని సంబరం.

ఎప్పుడైతే పెద్దపెట్టున గుండెలదిరేట్టు ఉరుముల మెరుపుల్తో వర్షం జోర్తైందో; అప్పుడే చిత్తుకాగితాల్ని జాగ్రత్తచేసి పట్టుకొచ్చి పడవలుచేయ నారంభించాను. నేల మీద కాలవలు బయలుదేరాయి.... నేనేమో వరండా అరుగుచివర కూర్చొని, చేసిన కాగితప్పడవల్ని ఓ ప్రక్కగా వుంచుకున్నాను. ఈదురుగాలిని తోడుచేసుకుని వర్షం ధారాపాతంగా కురవ సాగింది. నేనేమో చేసిన పడవల్ని ఒక్కొటొక్కటిగా వదిలిపెట్ట సాగాను.... అవి నా సరదాకూ - సంబరానికీ అనుగుణ్యంగా, నీటిలో తడుస్తూ, పోయినంత దూరంపోయి, పూర్తిగా తడిసేక బుడుంగున మునిగి - అల్లంత దూరాన తేలసాగాయి. అప్పుడు నాలోవున్న ఉత్సాహమంతా నీళ్ళు కారిపోయేది- ఎంతో నిరాశ; దిగులూ; ఏడ్పూ కలిగేవి.

ఇలా ఆ పూటల్లా సగం సంతోషం - మరో సగం విచారంతో గడిపాను.

వర్షం పిచ్చిగా కురుస్తూనేవుంది. ఊరూ వాడా జనమంతా ఎక్కడి వాళ్లక్కడ ఆ సాయంత్రం వరకూ పనిపాట్లకు వీలులేక స్థంభించి పోయారు. బజార్లన్నీ నీటితో కాలవలైనాయి.... అప్పుడు నాకు పెద్ద పెద్ద పడవల్ని చేయాలనిపించింది. మా వూరి చెరువు యీ వర్షానికి నిండుతుందనీ; ఒన్నేట్లోకీ; బుడమేట్లోకి నీళ్ళు పొంగి పొర్లి పారేట్టుగా వస్తాయనీ, ఇంట్లో మా నాన్నగారు అందరివంక చూస్తో అంటున్నారు—

ఇంతలో మా బామ్మ కురుస్తున్న వర్షం వంక చూస్తూ-

"పాపం సీతాలు యీవర్షంలో ఎక్కడ అఘోరిస్తోందో? ఇల్లూ - వాకిలీ లేంది! అని, జాలిగా అంది. అప్పుడుగానీ నాకు చటుక్కున సీతమ్మని గురించిన యావ కల్గలేదు-

"అవును.... ఇంత వర్షంలో ఎక్కడ తలదాచుకుందీ పాపం సీతమ్మ"- అని....

జవాబు ఎవరు చెప్తారు? ఎవరికి తెలుసు గనీ?

వర్షం అలా కురుస్తూండగానే, చీకటి పడింది. మా యింట్లో సంధ్యా దీపాలు వెలిగాయి.... తిండీ - నిద్ర విషయాల్లో క్రమంగా అంతా నిమగ్నులమైపోయాం.

పడుకున్నానన్నమాటేగానీ, చిన్నతనమైనా - నాకు మాత్రం మనస్సులో సీతమ్మని గురించే ఆలాపనా రాత్రంతానూ!

తూర్పు వాకిట తెల్లరేకలు పల్లవించినాయి.... తెల్లవార్లూ కురిసిన వర్షం వెలిసింది. వాతావరణమంతా చలి చలిగా ఉంది. సూర్యుడు కనిపించటం లేదు. ఆకాశంమీద తెలిమలి మబ్బులు వేగంగా ప్రయాణిస్తున్నాయి. అప్పుడే నిద్రలేచిన నాకు కనిపించే యీప్రశాంత దృశ్యమంతా యెంతో హాయిగా - ముచ్చటగా వుంది.

మొగం కడుక్కుందామని, వాకిట్లోకి వెళ్ళి అరుగుమీద కూర్చున్నాను. చలి

(తరువాయి 25 వ పేజీలో)

## ఆకు తొడిగిన చెట్టు

( 8 వ పేజీ తరువాయి)

గాలి ఇంకా వీస్తోనే వుంది. నాకు శరీర మంతా వణుకు పుట్టుకొచ్చింది. మా యింటిముందు బజారంతా ఇసుకలో మేట వేసుకుని పోయింది. సన్నగా నీరు కాలవగట్టి- బ్రిహ్మచారి యజ్ఞోపవీతంలా ప్రవహిస్తోంది. తడి ఇసుకమీద వాన పాములు గొయసుకట్టు వ్రాతలాగా పాకి పోతున్నాయి అటూ - ఇటూ ఆ దృశ్యం నా కెంతో ఆహ్లాదంగా వుంటంతో చూస్తూ వుండిపోయాను- తన్మయంతో.

ఇంతలో మా నాన్నగారికోసం, నలుగు రైదుగురు కాబోలు - మా వూరి పెద్ద మనుష్యులే-

"మీ నాన్నగారున్నారా బాబూ!" అంటూ వచ్చి నన్ను కలవర పరిచారు.

ఉన్నారన్నట్టు తలూపాను.... లేచి, గుమ్మం దాకా వెళ్లి మా నాన్నగార్ని పిలి చాను- 'ఇలా ఎవరో వచ్చారని చెబుతూ-'

ఆయన లోపల్నుంచి వస్తూనే-"రండి! రండి!"- అంటూ ఆ వ్యక్తుల్ని లోపలికి తీసుకునిపోయి కూర్చొండబెట్టి మర్యాద చేశారు.

ఇంతలో నేను, నా కార్యక్రమం ముగించుకుని లోపలికి పోతుండగా — సీతమ్మని గురించిన సంగతి అస్పష్టంగా- ఆ వ్యక్తుల మాటల్లో విన్నాను. వెంటనే చేతిలోని మరచెంబును సావిట్లో పెట్టేసి, బైటికివచ్చి మా నాన్నదగ్గరగా కూర్చొ న్నాను గబుక్కున.

ఆ వ్యక్తులు చెప్పే విషయానికి మా నాన్నగారు ఆశ్చర్యపడసాగారు. మొదట్లో నాకేమీ అర్థంకాలేదు.... ఆ వ్యక్తులు ఒక టికి రెండు సార్లు నొక్కి నొక్కి అన టంతో నాకిలా అర్థమైంది.

— "క్రితంరోజు మునిమాపువేళ - " అంతవర్షంలోనూ సీతమ్మ - మా వూరిలో రిబ్బన్లూ; జడకుప్పెలూ; పూలూ అమ్మే వీర్రాజుతో కలిసి, రైలెక్కి పట్నం వైపుగా పోవటం, రైలుదిగిన మా వూరి వాళ్ళు స్టేషన్లో చూశారుట. ఎంతో ఆశ్చర్య పడ్డారట కూడా." -

-ఎప్పడైతే, నాకిలా అర్థమైపోయిందో చటుక్కున లేచి, ఇంట్లోకి పరుగెత్తి కెళ్ళి అమ్మ కీ - బామ్మ కీ చెప్పేశాను అదరా బాదరాగా!

"అయ్యో! అయ్యో! దీనికిదేం మాయ రోగం.... ఎలా తెగించిందమ్మా చూస్తూ, చూస్తూ!"- అని, మా అమ్మా - బామ్మా విడ్డూరపడుతూ, ముక్కు మీద వేలుంచు కున్నారు.

నేను మాత్రం ముక్కుమీద వేలుంచు కోలేదు. ఎందుకంటే ఆశ్చర్యానికి, వింతకి అది గుర్తన్న సంగతి తెలియక, కళ్లతో మాత్రం చూస్తూ వూరుకున్నా.

కాసేపు సీతమ్మని గురించే అవీ - ఇవీ అనుకుని; మా నాన్నగారి దగ్గర సెలవు తీసుకుని, ఆ వచ్చిన వ్యక్తులు చక్కా వెళ్లారు. తరువాత మా నాన్నగారు లోప లికి వచ్చి -

"విన్నారటరా!" - అని, నేను చెప్పిందే పెద్ద పెద్ద మాటల్తో - దారుణ సాహస కృత్యంగా-చిత్రిస్తూ - చెప్పారు. అప్పుడు తెలిసింది - ఇలాంటి విషయాల్ని పెద్ద పెద్ద మాటల్తో చెప్పాలని నాకు.

ఆనాడు వూరూ - వాడా సీతమ్మని గురించే వింతగా - విశేషంగా చెప్పు కుంది.

ఈ వింతనీ - విశేషాన్నీ ఎన్నాళ్లగా మా వూరు చెప్పుకుందో నాకు అంత బాగా గుర్తులేదు....

ఎందుకనంటే; నాకు వయస్సు వస్తున్న కొద్దీ చదువుకోవాల్సిన బాధ్యత ఏర్పడింది. అదైన తరువాత ఉద్యోగం; అది చేస్తూం డగా వివాహం; క్రిమంగా పిల్లలు - ఓ కుటుంబీకుణ్ణయ్యాను- చివరకు.

నేను ప్రస్తుతం ఓ పెద్ద పట్టణంలో ఉద్యోగం చేస్తూ; జీవిస్తున్నాను- ఓ సరి పడని ఇంట్లో అద్దెకు వుంటూ. ఇటీవల ఓ విచిత్ర సంఘటన జరగటంతో; సీతమ్మ యెవరో? ఆమెను గురించీ; ఇంత వర దాకా తెర వెనుకపడివున్న గాథను తెలియ పర్చవలసి వచ్చింది.

నెలకు మూడు వారాలు రాత్రి డ్యూటీ; ఓ వారం పగలు డ్యూటీ కావటంతో చాలా భాగం పగలంతా నిద్రిలో; కుటుంబ పను లకో, బద్ధకం వదిలించుకోటానికో సరి పడి పోతూ ఉంది. నా చుట్టూ మసిలే మనుష్యుల్ని గురించీ; నా చుట్టూ తిరిగే ప్రిపంచం గురించీ ఆలోచించి అర్థం చేసు కోవటానికితీరికే వుంటం లేదు. నిజానికి. ఏదో వేళకింత తినటం; ఆఫీసుకు పోవ టం; కవరుకి అతికించిన స్టాంపు బిళ్లలాగా కుర్చీకి అతుక్కుని పనిచేయటం. ఇంతే లాగా కుర్చీకి అతుక్కుని పని చేయటం. ఇంతే తప్ప మరో ధ్యాసలేదు ఎప్పు డైనా సెలవనేది వస్తే- యేదో పని తీరిక లేకుండా తటస్థపడేది; ఇదీ లేకపోతే పిల్లలతో కాలక్షేపం చేయుటం జరిగేది.

తీరికలేని ఉద్యోగంకూడా జీవితాని ఒక శిక్ష లాంటిదే!

ఇలాంటి స్థితిగతుల్లో ఓనాడు పగలు డ్యూటీ ముగించుకు వచ్చాను. రావటం తోనే చెప్పలు విడిచి; చొక్కా లిప్పు తూండగా- మా యావిడతో, ఎవరో మాట్లాడుతూ వుండటం వినబడింది. గుమ్మానికి వున్న తెరతొంగించి చూశాను. ఓ నలభై యేళ్లావిడ మా కిష్టిగాడ్ని ముద్దా డుతూ ఎత్తుకూర్చుంది.

ముగతా పిల్లలంతా; సాయంత్రిం కావ టంతో ఆడుకోటానికి ఎక్కడికోపోయారు.

ఆమె, 'ఎవరోలే'- అని, బడలికతో అలాగే కుర్చీలో కూలబడిపోయాను; అమెను పల్కరించకుండా, ఇంతలో మా ఆవిడ కాసిని మంచినీళ్ళు, అవీ ఇస్తూ-

"మీ కోసం యెవరో సీతమ్మట. మీ వూరావిడట. చూట్టానికి వచ్చింది.... పల్కరించకుండా ఇలా కూర్చున్నా రేమిటీ!" అంది.

ఆ మాటతో నాకు కాస్త మెలకువ కల్గింది. మంచినీళ్లు తాగిగట్టంతోటే-

సీతమ్మ వున్న తావుకి చేరాను. ఆమె గౌరవంగా లేచి నిలబడింది. మనిషి బాగా ఎరుపెక్కి, ఎత్తరిగా వుంది. ముఖాన పెద్ద కుంకుమ బొట్టు సూర్యుడంత వుంది.... అయినా నాకు స్ఫురణకు కలగలా ఆమె యెవరైందీనూ!

ఇంతల్లో మా కిష్టిగాడు మాత్రం "నాన్నా" అంటూ వచ్చేసి నా చంక నెక్కాడు....

ఇంకా, నేను తెల్లబోయి చూస్తూ వుండటంతో-

ఇంకా నేను గుర్తుకు రాలేదటండీ.... సీతమ్మను...." అంది-

"క్షమించాలి....గుర్తుకు రావటం లేదు" అన్నాను.

"మీరు చాలా చిన్నవారు అప్పుడు.. నాకు మీరు గుర్తే...." అని నవ్వింది ...

ఆమె, తనెవరో త్వరగా చెప్పుకుంటే బాగుండుననిపించింది నాకు. లేకపోతే మూగతనం- నా తెలివి తక్కువతనం యెంతో చిరాకెత్తించే లాగుంది.

"నాదీ మీ వూరే! మీ రెప్పుడైనా మీ వూళ్ళో గణాచారి సీతమ్మ పేరు విన్నారా? ఆవిణ్నే నేను...."- అని వివరించింది.

అప్పటికిగానీ, యీ బృహస్పతికి బుద్ధి పనిచేయలేదు. ఆమె కథంతా గుండెలో కదిలింది.

"నువ్వా"- అనబోయి; ఇప్పుడు ఆమె ఉన్నస్థితిని గుర్తించి- "మీరా!"-అన్నాను.

"గుర్తొచ్చానా!" అన్నట్లు చూసింది.

"వచ్చా ర"న్నట్లు- తలూపాను....

"ఇక్కడ మీ వారేం చేస్తున్నారు?" అనడిగాను.

"మాకు ఒక ఫ్యాన్సీషాపు వుంది.... దాన్ని నడుపుకుంటూ జీవిస్తున్నాం...." అంది.

"పిల్లలా!"- అని అడక్కుండానే; సీతమ్మ- "నాకు నలుగురు ఆడపిల్లలండీ! - అంది నిండుగా- తృప్తిగా-

తనకెంత సంతానమైందీ చెప్పుకోవటంలో తల్లిదండ్రులు యెంతో ముచ్చట పడతారన్నది ఆమె పట్ల సత్యమైంది.

"ఆనాడు మీరు అలా వెళ్ళిపోయిన సంగతి వూరూ - వాడా విచిత్రంగా చెప్పుకుంది...."- అన్నాను యాదాలాపంగా....

నా మాటకు, ఆమె మెల్లిగా నవ్వి: "పుట్టటం నేనేమీ గణాచారిగా పుట్టలేదు. అందరి స్త్రీల మాదిరిగానే పుట్టాను. గణాచారత్వం మధ్యలో యేర్పడిన దశ. కాని, మనసుకూడా వయస్సుతో చలిస్తుంటే, అందరి ఆడవాళ్ళ మాదిరిగా నాకూ కోరికలు అభిరుచులూ కలిగినాయి. నాకూ వివాహం చేసుకోవాలనీ, భర్తే దైవంగా ఎంచుకుని సంసార జీవితాన్ని గడపాలనీ, సంతానవతిని కావాలనీ అభిలాష కల్గింది. నా మనస్సుకి నచ్చిన మనువుకోసం వయస్సు పైబడుతున్నా వేచివుండి, పొందగల్గాను. అంతేచాలనిపించింది జీవితానికి. మూఢ నమ్మకాలకు లొంగిపోయి కమ్మని జీవితాన్ని గణాచారిగా వుంచుకోవటం గిట్టలేదు ఆ బ్రతుకుపట్ల అసహ్యం కలిగింది. నాకు నేను ఒంటరి తనానికి బలికావటం ఘోరమనిపించింది. అడవికాచిన వెన్నెల్లా జీవితాన్ని వృధాచేసుకోవటం అవివేకమనిపించింది. నేనూ ఓ స్త్రీననీ; స్త్రీకి మాతృత్వం - భర్త పాదాల నీడలో బ్రతుకుని పండించుకోడం. ధ్యేయమనీ; పరాకాష్ఠయనీ తెలుసుకున్నాను. ఇందుకే ఇలా చేశాను...." - అని, తన మనోభావాల్ని వ్యక్తం చేసింది.

ఇలా చెప్పుకు రావటంతో సీతమ్మలోని సంస్కారం; మాట తీరు అర్ధమైంది నాకు.

ఎండి, మోడైపోతున్న తన జీవితాన్ని స్వహస్తాలతో ఉద్ధరించుకున్న సీతమ్మ ఇప్పుడు ఆకు తొడిగిన చెట్టులా - పచ్చని సంసారంతో- పూవుల్లాంటి పిల్లలతో- దేవుడులాంటి భర్తతో- దివ్యంగా కాపురం చేస్తోంది మా యింటి కెదురుగా వున్న ఇంటిలో- ఓ భాగంలో- నాకు మల్లే అద్దెకు ఉంటూ.

---

## సంఘం

సంఘమంటే సంస్థకాదోయ్
సంఘమంటే మనుష్యులోయ్

సంఘమును తీర్చిదిద్దగ
బాసచేసి, నడుంకట్టి
రాతి గుండెల కరగింపజూచి
సంఘ శ్రేయస్సుకు పాటుబడవోయ్.

సాంఘిక దురాచారాలను
దూర దూరముగ నుంచవోయ్
కండ గలిగిన వాళ్ళంతా
సంఘ శ్రేయస్సు గమనించవలెనోయ్
॥సంఘ॥

సంఘమే నీ స్వంతమనుకొని
స్వంతముగ పని చేయవోయ్
స్వంతముగ ఇల్లు దిద్దుకొని
స్వార్ధపరులను చేర్చకోయ్ ॥సంఘ॥

సంఘ బలమే అర్ధబలమోయ్
సంఘ సంస్కరణకు పూనుకోవోయ్
సంఘ మంటే చీదరించే
స్వార్ధపరులను చాటవోయ్ ॥సంఘ॥

సంఘమే మన ప్రజారాజ్యం
సంఘ శ్రేయస్సే రామరాజ్యం
సంఘమునే తిరస్కరించే
స్వార్ధపరులను మార్చవోయ్ ॥సంఘ॥

రచన:
"హరికిషన్"

---


## భయపడకండి

పోలియో అను పిలువబడు స్నాయువాతం చూసి భయపడకండి

ఆయుర్వేద పద్ధతులలో గ్యారంటిగా కుదర్చ గలం.
ఇప్పటికే ఎన్నో కేసులు కుదిర్చాం.

వివరములకు:

శ్రీ లక్ష్మీ నృశింహ
ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం.